బడి భవనం..బహుసుందరం

నాడు ఇది చిత్తూరు మండలంలోని పాలంతోపు ప్రాథమిక పాఠశాల. ఈ బడిలో కనీస వసతులు ఉండేవి కావు. పాఠశాల పూర్తిగా మరమ్మతులకు గురైంది. మరుగుదొడ్లు లేక పిల్లలు ఆరు బయటకు పరుగులు తీసేవారు. నిరుపేదల పిల్లలు మాత్రమే ఇక్కడ చదివేవారు. పాలకులు కానీ, అధికారులు కానీ, ఉపాధ్యాయులకు కానీ ఈ బడిని పట్టించుకునే వారు కాదు. అసలు ప్రభుత్వ బడులు అంటే అప్పట్లో ఇలాగే ఉండేవి. పాఠశాల ఆవరణ మంతా అపరిశుభ్రంగా, అస్తవ్యస్తంగా ఉండేది. విద్యార్థుల సంఖ్య కూడా అదే స్థాయిలో ఉండేది.



ప్రభుత్వం కూడా మొక్కుబడిగా పాఠశాలలను నడిపేది.

నేడు పాలంతోపు ప్రాథమిక పాఠశాల ఇదే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ బడులపై దృష్టి పెట్టింది. అధికారులు నాడు–నేడు పథకం ద్వారా మొదటి విడతలో ఈ స్కూల్‌ను ఎంపికచేశారు. లక్షలాది రూపాయలు వెచ్చించి పాఠశాల భవనాలకు మరమ్మతులు చేశారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా మార్చారు. సరికొత్త హంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఈ బడి ముస్తాబైంది. పిల్లలకు అవసరమైన అన్ని రకాల వసతులను పాఠశాల ఆవరణలో కల్పించారు. ఫలితంగా అడ్మిషన్ల సంఖ్య క్రమంగా



పెరుగుతూ వస్తోంది.

- ప్రభుత్వ పాఠశాలల సుందరీకరణ
- నాడు–నేడు కింద రూ.12 కోట్ల వ్యయం
- మొదటి విడతలో 42, రెండో విడతలో 34 బడుల అభివృద్ధి



తుమ్మింద జెడ్పీ ఉన్నత పాఠశాల

మండలంలోని విద్యాశాఖ వివరాలు		
మొత్తం పాఠశాలలు	-	126
ప్రాథమిక	-	90
ప్రాథమికోన్నత	-	13
జెడ్పీ	-	23
విద్యార్థుల సంఖ్య	-	10411

చిత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మారాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల అంటేనే చిన్నచూపు ఉండేది. సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన నూతన సంస్కరణలతో ప్రభుత్వ బడులపై అభిప్రాయం మారింది. పిల్లలను ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ బడులకు పంపే రోజులు మొదలయ్యాయి. అదే సమయంలో ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకే పరిమితం అయిన ఇంగ్లిష్ మీడియంను ప్రభుత్వ బడుల్లో ప్రవేశపెట్టి ప్రజల ప్రశంసలు అందుకుంటోంది.

నాడు–నేడు కింద ఆధునికీకరణ

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం నాడు–నేడు పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద మండలంలో తొలి విడతలో 34 పాఠశాలలను ఎంపిక చేసి వాటిలో అదనపు గదుల నిర్మాణం, ఫ్లోరింగ్, ఫ్యాన్లు, టాయిలెట్స్, వాటర్ ప్లాంట్, ఆధునిక బెంచీలు వంటివి ఏర్పాటు చేశారు. అందుకు గాను మొదటి విడత కింద రూ.4.37 కోట్ల నిధులను వెచ్చించారు. అంతే కాకుండా రెండో విడత కింద మొత్తం 52 స్కూళ్లను, 05 కాలేజీలను ఎంపిక చేసి వాటిని ఆధునీకరించేందుకు రూ.7.68 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం రెండో విడత పనులు జరుగుతున్నాయి.

సంక్షేమ పథకాలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, గోరుముద్ద, విద్యాదీవెన, వసతిదీవెన వంటి సంక్షేమ పథకాల ద్వారా మండలంలో సుమారు 10వేల మందికి పైగా లబ్ధి చేకూరుతుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలోనే ఈ పథకాలన్నీ అమల్లోకి వచ్చాయి. తల్లిదండ్రులపై చదువుల భారాన్ని ప్రభుత్వం తగ్గించడంతోపాటు దాదాపు అన్ని పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన ప్రవేశపెట్టారు. దీంతో పేద విద్యార్థులు సైతం ఇంగ్లిష్ పట్ల ఆసక్తి చూపుతున్నారు. వారిలో కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచేందుకు ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేసింది. ప్రభుత్వ బడులు ప్రస్తుతం కార్పొరేట్‌కు దీటుగా ముస్తాబయ్యాయి.

ఈ బడి రూపురేఖలే మారిపోయాయి



“ గతంలో ఇరుకు గదుల్లో, చాలీచాలని మరుగుదొడ్లతో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. అంతేకాకుండా మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉండేది. ఇప్పుడు అలా లేదు. ఈ బడి రూపు రేఖలే మారిపోయాయి. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారు. వసతులు కల్పించారు. పాఠాలు చెప్పే తీరు కూడా మారింది. పిల్లలను చదివించే బాధ్యతను కూడా ప్రభుత్వమే తీసుకుంది. ఈ పాఠశాలకు బాగుపడుతుందని కలలో కూడా అనుకోలేదు.

– సుమతి, తుమ్మింద, చిత్తూరు మండలం

కొత్త సంస్కరణలతో...



రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో తీసుకువచ్చిన సంస్కరణల ద్వారా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థుల సంఖ్య, ఉత్తీర్ణత శాతం పెరిగింది. గతంలో పాఠశాలలో వసతులు కల్పించాలంటే కొన్ని సంవత్సరాలు పట్టేది. నాడు–నేడు పథకం ద్వారా ప్రస్తుతం ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వమే కల్పిస్తూ విద్యార్థుల ఉన్నతికి పాటుపడుతుంది.

– హేమాద్రి, హెచ్‌ఎం, తుమ్మింద జెడ్పీ ఉన్నత పాఠశాల

నాడు–నేడు వేగవంతం



వడ్రాంపల్లె పాఠశాలలో నాడు–నేడు పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ–2 దామోదర్‌నాయుడు

ఐరాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని అదనపు ఎంఈఓ దామోదర్‌నాయుడు సూచించారు. మండలంలోని వడ్రాంపల్లె ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఎంఈవో మాట్లాడుతూ మనబడి నాడు–నేడు పథకం ద్వారా బడి భవన నిర్మాణాలతో పాటు మౌళిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. నాడు–నేడు పనులు చేపడుతున్న పాఠశాలల హెచ్‌ఎంలు పనులపై దృష్టి సారించాలని సూచించారు. కాణిపాకం, చిగరపల్లె, వడ్రాంపల్లె ప్రాథమిక పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. చిగరపల్లె ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రూచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. చదువులో వెనకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

నలుగురికి కారుణ్య నియామకాలు



నియామక పత్రాలు అందజేస్తున్న జేసీ

చిత్తూరు కలెక్టరేట్ : నలుగురు ఉద్యోగులకు కారుణ్య నియామకపత్రాలను అందజేశారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు చేతుల మీదుగా ఆ ఉద్యోగులకు నియామక పత్రాలను ఇచ్చారు. కారుణ్య నియామకాల్లో ఆ ఉద్యోగులను వివిధ శాఖల్లో నియమించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రాజశేఖర్, ఏవో కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి వినతి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పూతలపట్టు: మండలంలోని సమస్యలు పరిష్కరించాలని మండల వైఎస్సార్ సీపీ నాయకులు తహసీల్దార్ విజయభాస్కర్‌కు విన్నవించారు. మండల కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ విజయభాస్కర్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు, శ్మశానవాటిక, ఇళ్ల పట్టాల వంటి పలు సమస్యలపై వైఎస్సార్ సీపీ నాయకులు చర్చించారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ లైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, పూతలపట్టు పంచాయతీ ఇన్‌చార్జి జగదీశ్వర్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ సుధాకర్ రెడ్డి, సర్పంచ్ మాసిలామణి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయండి



మాట్లాడుతున్న సీఐ కత్తి శ్రీనివాసులు

పూతలపట్టు: మండలంలోని మహిళా పోలీసులు బాధ్యతతో పనిచేయాలని కల్లూరు సీఐ కత్తి శ్రీనివాసులు అన్నారు. ఆయన సోమవారం మండలంలోని పోలీసుస్టేషన్‌ను సందర్శించి, మొదటిసారి మహిళా పోలీసులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికంగా ఫైబర్ క్రైమ్, గంజాయి కేసులపైన దృష్టి పెట్టాలని చెప్పారు. మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పోలీసులకు సమాచారాన్ని చేరవేయాలన్నారు. పేకాట, నాటు సారాపై నిఘా ఉంచాలని సూచించారు. సమస్యాత్మక పరిస్థితుల్లో మహిళా పోలీసులు నేరుగా ఆయన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైటర్ కృష్ణయ్యశెట్టి, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఆకనంబట్టులో క్రికెట్ టోర్నీ



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న పూతలపట్టు సర్పంచ్ మాసిలామణి

పూతలపట్టు: మండలంలోని ఆకనంబట్టు పంచాయతీలో జైభీమ్ అంబేడ్కర్ టీం ఆధ్వర్యంలో సోమవారం క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. ఇందులో భాగంగా పూతలపట్టు సర్పంచ్ మాసిలామణి మొదటి మ్యాచ్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 15 రోజుల పాటు జరిగే ఈ మ్యాచ్‌లో 30 జట్లు పాల్గొంటాయని తెలిపారు. టోర్నీ విజేతలకు మొదటి బహుమతిగా రూ.30,000, రెండవ బహుమతిగా 15000, మూడవ బహుమతిగా 5000 రూపాయలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకనంబట్టు సర్పంచ్ ఎంఎస్ మణి, గొడుగుచింత సర్పంచ్ సుబ్రమణ్యం, నాయకులు బాలాజీ, షణ్ముగం, జయపాల్, నాయకురాలు నాగజ్యోతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల అహ్వానం

పూతలపట్టు: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీపోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐరాల సీడీపీఓ నిర్మల ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని మోటకంపల్లె అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ–1), ఆకనంబట్టు దళితవాడలో అంగన్‌వాడీ సహాయకురాలు (ఎస్సీ–1) పోస్టులు ఖాళీగా ఉనాయన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణత చెంది, ఈ నెల 1వతేదీ నాటికి 21–35 ఏళ్ల వయసు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు వివాహితులై స్థానికంగా ఉండాలన్నారు. ఇదివరకే అంగన్‌వాడీ సహాయకురాలుగా పనిచేస్తున్న వారు దరఖాస్తు చేసుకోవాలంటే వయస్సు 45 ఏళ్లకు మించి ఉండరాదని స్పష్టం చేశారు. ఈ నెల 17 వతేదీ నుంచి 22 వతేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను ఐరాల క్రాస్‌లోని సీడీపీఓ ప్రాజెక్టు కార్యాలయంలో అందించాలని కోరారు.

వైభవంగా అమావాస్య పూజలు

గుడిపాల: నరహరిపేట చెక్‌పోస్ట్ సమీపంలో ఉన్న భద్రకాళమ్మ ఆలయంలో సోమవారం అమావాస్య పూజలను వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. వచ్చిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.



భద్రకాళమ్మ ఆలయంలో అమ్మవారి ఊంజల్‌సేవలో పాల్గొన్న భక్తులు

స్పందనకు 9 వినతులు



వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మొత్తం తొమ్మిది వినతులు అందినట్లు నగర కమిషనర్ అరుణ పేర్కొన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో ఇంజినీరింగ్ 5, ప్రజారోగ్య విభాగం –2, మెప్మా –1, టీపీవో –1 చొప్పున మొత్తం 09 వినతులు అందాయి. అనంతరం జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు నిర్వహించిన స్పందన వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ పాల్గొన్నారు. స్పందన, జగనన్నకు చెబుదాం, ఏపీ సేవా పోర్టల్ సర్వీసులపై నగర పాలక అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంహెచ్వో లోకేష్, ఎంఈ వెంకట ప్రసాద్, ఏసీపీ రామకష్ణుడు, సీఎంఎం గోపి, మేనేజర్ తనూజ ఇతర అధికారులు పాల్గొన్నారు.

వేగంగా డ్రైనేజీ పనులు పూర్తి చేయండి

డ్రైనేజీ నిర్మాణం, మట్టి నింపే పనులు వేగంగా పూర్తి చేయాలని నగర కమిషనర్ అరుణ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని గాంధీ రోడ్ విద్యుత్ కార్యాలయం వెనుకవైపు జరుగుతున్న డ్రైనేజీ పనులను కమిషనర్ సోమవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. డ్రైనేజీ కాలువకు ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలాల్లో పూర్తిగా మట్టితో నింపాలన్నారు. పనుల్లో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈ వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు శ్రీరామరక్ష



సర్టిఫికెట్లను అందజేస్తున్న అధికారులు

బంగారుపాళెం: జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు శ్రీరామ రక్ష లాంటిదని ఎంపీపీ అమరావతి అన్నారు. మండలంలోని కూర్మాయిపల్లె గ్రామ సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష గ్రామ సభను అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ, అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందుకోలేనివారికి లబ్ధి చేకూర్చేందు కోసమే జగనన్న సురక్ష కార్యక్రమమని తెలిపారు. దీని ద్వారా 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలకు అవసరమైన సర్టిఫికెట్లు తీసుకోవాలంటే రోజుల తరబడి మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులని గుర్తు చేశారు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి లేదన్నారు. అనంతరం ప్రజలకు వివిధ రకాల ధృవపత్రాలను అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ హేమలత, ఎంపీటీసీ ఇందుశేఖర్‌రెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పుణ్యసముద్రంలో..

తవణంపల్లె: మండలంలోని పుణ్యసముద్రం, సరకల్లు గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ తెలిపారు. జగనన్న సురక్ష పథకం కింద 11 రకాల పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటి వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- రంగాచారివీధిలో గడపగడపకు మన ప్రభుత్వం



కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పక్కన డివిజన్ ఇన్‌చార్జి అల్తాఫ్

చిత్తూరు కార్పొరేషన్: అర్హులందరికీ ఇళ్ల వద్దకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం 44వ డివిజన్ రంగాచారివీధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చిన్న శివాలయంలో పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం స్వామిరెడ్డివీధి, బాజాలవీధి, రంగాచారివీధి, ఈశ్వర గుడివీధి, ఇన్‌వైట్‌లైన్, మార్కెట్‌చౌక్, ఆజాద్‌వీధుల్లో పర్యటించారు. ఈ నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానికులను అడిగి సమస్యలను తెలుసుకోవడంతోపాటు వాటి పరిష్కారమే లక్ష్యమన్నారు. నగరంలోని సచివాలయాలకు మరో రూ.50 లక్షలు అదనంగా సీఎం ఇటీవల చిత్తూరులో ప్రకటించిన విషయం గుర్తు చేశారు. ఆయా నిధులతో ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఎక్కడా లేని విధంగా అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, మనబడి నాడు–నేడు కార్యక్రమాల అమలు ద్వారా ప్రతి ఒక్కరూ చదువుకుని ఉన్నత విద్యావంతులుగా ఎదగటానికి అవకాశం ఏర్పడిందన్నారు. డ్వాక్రా అక్క చెల్లెమ్మలు, బీసీ, ఎస్సీ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించటానికి ఆసరా, చేయూత వంటి పథకాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ నజీరా, డివిజన్ ఇన్‌చార్జి మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, సచివాలయ కన్వీనర్లు రాంగణేష్, కోలాకిరణ్, నాయకులు షరీఫ్, వినాయకబాలాజీ, రఘురాం, ప్రేమ్, సీతాపతి, సుల్తాన్, వరలక్ష్మి, చిట్టి, హరి, సంబంధిత ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు తేనెబండరోడ్డులో..

స్థానిక 44వ డివిజన్ తేనెబండరోడ్డులో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డివిజన్ ఇన్‌చార్జి అల్తాఫ్ తెలిపారు. ఉదయం నాగాలమ్మగుడిలో పూజలు చేసి అనంతరం వీరభద్రకాలనీ, ప్రశాంత్‌నగర్, ఏటివార, తేనెబండరోడ్డు ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు.

స్పందనలో స్పృహ కోల్పోయిన ఉద్యోగిని

చిత్తూరు కలెక్టరేట్ : స్పందన కార్యక్రమంలో వినతి పత్రం ఇచ్చేందుకు విచ్చేసిన సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రేణుక స్పృహ కోల్పోయి పడిపోయారు. తన సమస్యను విన్నవించుకునేందుకు ఆ ఉద్యోగిని సోమవారం స్పందన కార్యక్రమానికి విచ్చేశారు. క్యూలో ఉన్న ఆమె స్పృహ కోల్పోయి పడిపోవడంతో కలెక్టరేట్ సిబ్బంది 108కు సమాచారం అందించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు చికిత్స అందించారని, ఎటువంటి సమస్య లేదని కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో అందరికీ వైద్యం



ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్



గుడిపాల: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రక్షిత

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలన్నదే ఫ్యామిలీ డాక్టర్ లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని బీరప్పచెరువులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో వైద్యాధికారి 75 మంది రోగుకలు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నాం

గుడిపాల: ప్రతి గ్రామంలో సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ రష్మిత అన్నారు. పానాటూరు గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా మంచం పట్టిన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం గర్భిణులు, సుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 65 మంది రోగులకు చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శాంతకుమారి, ప్రియాంక, శివగామి, మనిమేఘల, భారతి పాల్గొన్నారు.

పిల్లలకు ఆటపాటలతో పాఠాలు

- అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులకు శిక్షణ
- ఇంటి వద్ద తల్లులే నేర్పించేలా చర్యలు
- పకడ్బందీగా చేపట్టిన ఐసీడీఎస్



గుడిపాల అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు బోధిస్తున్న సిబ్బంది

గుడిపాల: అమ్మను ఆది గురువు అంటారు. దీన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సమర్థవంతంగా అమలు చేస్తోంది సమగ్ర శిశు సంక్షేమం, అభివృద్ధి శాఖ (ఐసీడీఎస్). తల్లులే ఇంటి వద్ద ఆట, పాటలతో పిల్లలకు పాఠాలు బోధించే కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు. ఏ రోజు పాఠాలను ఆరోజు అంగన్‌వాడీ కార్యకర్త తల్లి సెల్‌ఫోన్‌కు వాట్సాప్‌లో చేరవేస్తున్నారు. తల్లులు వాటిని పిల్లలతో వల్లె వేయిస్తున్నారు. ఈ విధానంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు, పిల్లల తల్లులకు ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఏడాది జూలై నుంచి ఈ బోధనా ప్రక్రియ మొదలైంది.

యాప్‌లో పాఠాలు

ఐసీడీఎస్ చిత్తూరు ప్రాజెక్ట్ పరిధిలో చిత్తూరు, చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల్లో 228 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో ఏడు నెలల నుంచి మూడేళ్ల వయసులోపు పిల్లలు 2974 మంది ఉన్నారు. మూడు నుంచి ఆరేళ్లలోపు వయసు పిల్లలు 2576 మంది ఉన్నారు. మూడో ఏడాది పూర్తయి నాలుగేళ్లలోపు వయసు చిన్నారుల కోసం పీపీ–1, 4 నుంచి 6 ఏళ్ల వయసు చిన్నారుల కోసం పీపీ–2 పేరుతో రెండు కేటగిరీల్లో పాఠాలు రూపొందించారు. వాటిని ప్రత్యేక యాప్‌లో పొందుపరిచే బాధ్యతను ఐసీడీఎస్ చేపట్టింది. ఈ యాప్‌లోని పాఠాలు తొలుత ఐసీడీఎస్ జిల్లా స్థాయి అధికారులకు చేరతాయి. వారు పరిశీలించిన తరువాత వాటిని జిల్లాలోని సీడీపీఓలకు పంపుతారు. అక్కడినుంచి ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు వారి ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలకు చేరుతుంది. ప్రతి కార్యకర్త తమ పరిధిలో తల్లుల గ్రూపులకు పీపీ–1, పీపీ–2 పాఠాలను పంపిస్తారు. నాలుగేళ్లలోపు వయసు పిల్లలు రోజూ తల్లులతో కలిసి అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పౌష్టికాహారాన్ని తీసుకొని ఇళ్లకు వెళ్లిపోతారు. అంటే మూడు–నాలుగేళ్ల మధ్య పిల్లలకు యాప్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రం నుంచి తమ వాట్సాప్‌కు వచ్చిన పీపీ–1 పాఠ్యాంశాలను వారి తల్లులు ఇంటి వద్ద బోధిస్తారు. వారికి కార్యకర్తలు పాఠాలు బోధిస్తారు. అవే పాఠాలను వారి తల్లుల వాట్సాప్‌కు పంపుతారు. వాటిని తల్లులు ఇంటివద్ద తమ చిన్నారులతో రివిజన్ చేయిస్తుంటారు. అంటే అంగన్‌వాడీ కేంద్రాల్లో బోధించిన ఇంగ్లీషు, లెక్కలు వంటి సబ్జెక్టులను తల్లులు తమ పిల్లలతో మళ్లీ వల్లె వేయిస్తారు.

చిన్నారుల్లో మేధస్సు పెంచేలా..



పిలల్లో సంపూర్ణ వికాసం, మేధస్సు పెంపొందించడం, బడికి సన్నద్ధం చేయడం ప్రీస్కూల్ ముఖ్య ఉద్దేశం. ప్రీస్కూల్ విద్యతో చిన్నారులకు అనేక లాభాలు ఉన్నాయి. మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయసు పిల్లల్లో మెదడు శరవేగంగా అభివృద్ధి చెందుతుంది.

- రాజేశ్వరి, ఐసీడీఎస్, చిత్తూరు ప్రాజెక్ట్

విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలి



ఎంఈఓ హేమలతను సత్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

తవణంపల్లె: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులపై ఉపాధ్యాయులు గుణాత్మక విద్యనందించాలని ఎంఈఓ హేమలత తెలిపారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎంఈఓ హేమలతను పీఆర్‌టీయూ నాయకుల బృందం సోమవారం ఎంఆర్‌సీలో కలసి శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తున్నదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలన్నారు. పీఆర్‌టీయూ నాయకులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు ప్రకాష్‌రెడ్డి, అసోషియేట్ ప్రెసిడెంట్ విజయభాస్కర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. లవకుమార్, వెంగంపల్లె హైస్కూల్ హెచ్‌ఎం శాంతి, కృష్ణాపురం హెచ్‌ఎం లూథేశ్వరి, మండల పీఆర్‌టీయూ నాయకులు మునస్వామి తదితరులు పాల్గొన్నారు.